క్లుప్తంగా

సావెల్ యువకుడికి గ్రూప్‌-1 ఉద్యోగం



బాల్కొండ: మెండోరా మండలం సావెల్ గ్రామానికి చెందిన దోన్‌పాల కిరణ్ గ్రూప్‌-1 మొదటి ప్రయత్నంలో సత్తా చాటాడు. గ్రూప్ -1 ఫలితాల్లో అసిస్టెంట్ ఆడిట్ అధికారి ఎంపికయ్యా డు. ఈ మేరకు శనివారం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా హైదరాబాద్ శిల్పకళా వేదికలో నియామక పత్రం అందుకున్నాడు. గ్రామానికి చెందిన యువకుడు గ్రూప్‌-1 ఉద్యోగం సాధించడం పై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



బోధన్: వానాకాలం సీజన్ వరి పంట కోతలు ప్రారంభమైన పరిస్థితిలో వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం తహసీల్దార్ ఆఫీస్‌లో ఉప తహసీల్దార్ అనూషకు అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్, నాయకులు వినతి పత్రం అందించారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం జరిగితే దళారులు రంగ ప్రవేశం చేసి మద్దతు కన్నా తక్కువ ధరకు కొనుగోలు చేసే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ధాన్యం క్వింటాలుకు రూ.3వేల 200 కనీస మద్దతు ధర చెల్లించాలని తెలిపారు.గడిచిన యాసంగిలో వడ్లు అమ్మిన రైతులకు క్వింటాలుకు రూ. 500 బోనస్ వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. నాయకులు రవి, శ్రీపతి మల్లేష్, హన్మాండ్లు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐబీఎస్ఎస్ ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడి నియామకం



మాక్లూర్: ఆల్‌ఇండియా బంజార సేవా సంఘం ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడిగా మండలంలోని కల్లెడి గ్రామానికి చెందిన కుంచోత్ కిషన్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఏఐబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సభవత్ రాములు నాయక్ చేతులమీదుగా నియామక పత్రం అందుకున్నట్లు కిషన్ తెలిపారు.

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి



రెంజల్(బోధన్): వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని రెంజల్ ఎస్సై చంద్రమోహన్ సూచించారు. శనివారం మండలంలోని కళ్యాపూర్ చౌరస్తాలో స్థానికులతో సమావేశమయ్యారు. హెల్మెట్ ధరించడంతో కలిగే ప్రయోజనాలు, ధరించకపోవడంతో కలిగే అనర్థాలను వివరించారు. ద్విచక్ర వాహనదారులు ప్రయాణ సమయంలో హెల్మెట్ వినియోగించాలని వివరించారు. ఆయన వెంట రెంజల్‌-2 ఎస్సై రాజు ఉన్నారు.

నాణ్యతగా ఇంటి నిర్మాణం చేసుకోవాలి



వర్ని (మోస్రా): ప్రభుత్వం పేదల కోసం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు, నాణ్యతగా సకాలంలో నిర్మించుకోవాలని వర్ని మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు కొత్తిమీర్ కార్ లక్ష్మణ్ సూచించారు. శనివారం మోస్రాలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. పంచాయతీ కార్యదర్శి శ్రావణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బిల్లా రాజశేఖర్ రెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు పోతారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఇంతియాజ్ పాల్గొన్నారు.

చిత్తూ చిత్తుల బొమ్మ..



సిద్దార్థ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు జరుపుకుంటున్న విద్యార్థులు



జంబిహనుమాన్ ఆలయ ఆవరణలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న వినయ్‌రెడ్డి



రుద్రూర్‌లో హంస వాహనంపై బతుకమ్మ

ఆర్మూర్‌టౌన్/రుద్రూర్/బాల్కొండ/బోధన్/రెంజల్/ : బతుకమ్మ సంబురాలు ఘనంగా సాగుతున్నాయి. ఆర్మూర్‌లోని జంబిహనుమాన్ ఆలయ ఆవరణలో మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మహిళ సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చి బతుకుమ్మ ఆడారు. రంగురంగుల పూలను పేర్చి నృత్యాలు చేస్తు ఆనందంగా గడిపారు.అనంతరం మహిళలు బహుమతులు అందజేశారు. ఆర్మూర్‌లోని సిద్దార్థ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నియెజక వర్గ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి,మున్సిపల్ కమిషనర్ రాజు, మార్కెట్‌కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, మున్సిపల్ సిబ్బంది, మెప్మా ఆర్పీలు, మహిళ సంఘాల సభ్యులు, కళాశాల అధ్యాపకులు రాకేష్, బాలరాజ్, అరవింద్, రాజశేఖర్, శ్రీధర్, ప్రమోద్, రజనీకాంత్, అర్చన, సుమలత, నిఖిత, నవనీత, విద్యార్థులు పాల్గొన్నారు. రుద్రూర్‌లో అయ్యవార్ల సాదుల లక్ష్మీ నరసయ్య కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా బతుకమ్మను తయారు చేశారు. హంస వాహనంపై బతుకమ్మ వెళ్తున్నట్టుగా రంగుల పువ్వులతో తయారు చేశారు. ఈబతుకమ్మ స్థానికులను విశేషంగా ఆకర్షిస్తుంది. అలాగే రుద్రూర్‌లో కుర్లెం కుటుంబ సభ్యులు అతి పెద్ద బతుకమ్మ తయారు చేశారు. మహిళలు ఆలయాలు, ప్రధాన వీధుల్లో బతుకమ్మ ఆడి చెరువుల్లో నిమజ్జనం చేశారు. బాల్కొండ మండల కేంద్రంలోని శాంభవి పాఠశాలలో బతుమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.



రుద్రూర్ అంగడి బజార్‌లో అతి పెద్ద బతుకమ్మ



బాల్కొండలో బతుకమ్మ ఆడుతున్న శాంభవి పాఠశాల సిబ్బంది, విద్యార్థులు



మావందికలాన్‌లో బతుకమ్మతో మహిళలు



దూపల్లిలో ..



కుమ్మన్‌పల్లి గ్రామంలో ..



ఆర్మూర్ కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి, మహిళా న్యాయవాదులు

రైతులందరికీ మాఫీ చేయాలని తీర్మానం

బోధన్: ఎడపల్లి మండలంలోని జానకంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం 2024–25 వార్షిక మహాజన సభ చైర్మన్ మిద్దె నరేందర్ అధ్యక్షతన నిర్వహించారు. సొసైటీ జమా ఖర్చుల నివేదికన సీఈవో గంగారెడ్డి చదవి వినిపించారు. పలు తీర్మానాలు ఆమోదించారు. పంట రుణమాఫీ కాని రైతులందరికీ మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేశారు.ఎన్‌డీసీసీబీ బ్రాంచ్ ఏర్పాటు చేయాలని, వే బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కోరుతూ తీర్మానించారు.సొసైటీ చైర్మన్ మిద్దె నరేందర్, వైస్ చైర్మన్ దాసరి ఒడ్డెన్న, ఏఎంసీ డైరెక్టర్ కిషోర్, డైరెక్టర్లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.ఎడపల్లి సొసైటీమహాజన సభ చైర్మన్ పోల మల్కారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సొసైటీ సీఈవో రాజరాం జమా ఖర్చుల నివేదికను చదవి వినిపించారు. రబీ సీజన్ వరి ధాన్యం బోనస్ చెల్లించాలని రైతులు కోరారు. వైస్ చైర్మన్ అనిల్ రెడ్డి, డైరెక్టర్లు, రైతులు ప్రభాకర్ గౌడ్, శ్రీనివాస్, సురేష్, బేగరి సాయిలు తదితరులు పాల్గొన్నారు.



జానకంపేట సొసైటీ మహాజన సభలో మాట్లాడుతున్న చైర్మన్ మిద్దె నరేందర్

దంచి కొట్టిన వాన.. కాలనీలు జలమయం



రెంజల్(బోధన్): మండలంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో వరి పంట నేలవాలగా, లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. మట్టి రోడ్లు చిత్తడిగా మారాయి. పలు కాలనీల్లో నీరు చేరి చెరువులను తలపించాయి. నీలా, కందకుర్తి, బోర్గాం, తాడ్‌బిలోలి గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి




ఆర్మూర్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు



కమ్మర్‌పల్లిలో కొండా లక్ష్మణ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సునీల్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్/కమ్మర్‌పల్లి/వర్ని/నందిపేట్/వేల్పూర్/రుద్రూర్ : ఆర్మూర్, బాల్కొండ, బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, పద్మశాలి సంఘం నాయకులు కొండాలక్ష్మణ్ విగ్రహం, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. బోధన్, ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయం, బార్ అసోయేషన్ సభ్యులు, వివిధ స్వచ్ఛంద సంస్థల సభ్యులు కొండా లక్ష్మణ్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఆర్మూర్‌లోని రంగచారి నగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియెజక వర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి కొండా లక్ష్మణ్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు తెలంగాణ సాధన కోసం బాపూజీ చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు.



కొండా లక్ష్మణ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



మోస్రాలో.. పద్మశాలి సంఘం నాయకులు



నందిపేటలో ..



రుద్రూర్ చేనేత సహకార సంఘంలో ..

అలీసాగర్ వరద నీటి విడుదల



బోధన్: ఎడపల్లి మండలంలోని ఠాణాకలాన్ గ్రామ శివారులో గల అలీసాగర్ రిజర్వాయర్ కు ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద నీరు చేరుతోంది. అలీసాగర్ రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 1299.6 ఫీట్లు కాగా 1298.4 వరద నీరు చేరింది. శనివారం రిజర్వాయర్ రెండు గేట్లు ఎత్తి దిగువన నిజాంసాగర్ ప్రాజెక్టు డి–50 కాలువలోకి నీటిని వదిలారు. రెండు గేట్ల ద్వారా 600 క్యూసెక్కుల నీరు దిగువకు వదలినట్లు నీటి పారుదశాఖ అధికారులు తెలిపారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల 18 మద్యం దుకాణాలకు దరఖా స్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ ప్రభాకర్‌రావు అన్నారు. శనివారం పట్టణంలోని ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

మాక్లూర్: మండలంలోని కల్లెడి గ్రామంలో బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం బీజేపీ నాయకులు అందించారు. గ్రామంలో 10 మంది బాధితులకు కలిపి రూ.1.71 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు కాగా, వాటిని బీజేపీ నాయకుడు గంగోళ్ల ప్రళయ్‌తేజ్ అందించారు. ఈ గ్రామ బూత్ అధ్యక్షుడు మచ్చర్ల అర్జిత్, అరుణ్, బి నగేష్, ప్రశాంత్, దినేష్ పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని నాళేశ్వర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షులు చిన్నదొడ్డి ప్రవీణ్ శనివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బాధితులకు అందజేశారు. గ్రామంలోని ఎనిమిది మందికి రూ. 2.5 లక్షల చెక్కులు మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు.



కల్లెడిలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందిస్తున్న బీజేపీ నాయకుడు ప్రళయ్‌తేజ్

రూ. 2 లక్షల ఎల్‌వోసీ అందజేత

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన గజ్జెల విజయలక్ష్మి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్య ఖర్చులు అధికం అవుతుండడంతో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన రూ. 2 లక్షల ఎల్‌వోసీ(లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరు చేయించారు. శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి నివాసంలో విజయలక్ష్మి భర్త శ్రీనివాస్‌కు ఎల్‌వోసీ అందజేశారు.

డ్రా పద్ధతిలో వార్డుల రిజర్వేషన్లు



డొంకేశ్వర్/బాల్కొండ/నవీపేట : స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల ప్రక్రియ శనివారం డొంకేశ్వర్ ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి కృష్ణ, ఎంపీడీవో బుక్య లింగం, తహసీల్దార్ నరేశ్ నిర్వహించారు. పదమూడు గ్రామ పంచాయతీల్లో 118 వార్డులకు సంబంధించిన రిజర్వేషన్లను రాజకీయ పార్టీల నాయకుల ముందు డ్రా పద్ధతిలో తీశారు.నవీపేట ఎంపీపీ కార్యాలయంలో ఎంపీడీవో నాగనాథ్, తహసీల్దార్ వెంకట రమణ, ఎంపీవో రామకృష్ణల ఆధ్వర్యంలో పలు పార్టీల నాయకుల సమక్షంలో రిజర్వేషన్లను ఖరారు చేశారు. మండలంలోని 32 జీపీలలో 288 వార్డులకు రిజర్వేషన్లను ఖరారు చేశారు. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల కోసం వార్డుల రిజర్వేషన్లను డ్రా పద్ధతిలో తీశారు. ఆయా పార్టీల రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

జగన్మాత.. నమోస్తుతే



ఆర్మూర్‌లోని యువ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



వేల్పూర్‌లో పెద్దమ్మతల్లి మండపం వద్ద లక్ష్మీదేవి అలంకరణలో దుర్గామాత

ఆర్మూర్‌టౌన్/వేల్పూర్/నందిపేట్ : ఆర్మూర్‌లోని దయానంద్ నగర్ కాలనీలో యువ యూత్ ఆధ్వర్యంలో శనివారం కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆర్మూర్ మండలం కోమన్‌పల్లి గ్రామంలోని దుర్గామాత అన్నప్రసాదానికి ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ రాజశేఖర్ రూ. 10వేలు అందజేశారు. వేల్పూర్‌లోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి మండపం వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాతను లక్ష్మీదేవి రూపంలో అలంకరించారు. నందిపేట మండలం చింరాజ్‌పల్లి గ్రామంలో దుర్గామాత అమ్మవారిని రూ. 21.50 లక్షల నగదుతో అలంకరించారు.పలు మండపాలలో హోమంతో పాటు, కుంకుమ పూజలను నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.



చింరాజ్‌పల్లి గ్రామంలో రూ. 21.50 లక్షల నగదుతో అలంకరించిన దుర్గామాత

కులరహిత సమాజం కోసం పోరాడుదాం

ఆర్మూర్: మహాత్మా జ్యోతీబాపూలే స్ఫూర్తితో కులరహిత సమాజం కోసం పోరాడుదామని సీపీఐ(ఎం.ఎల్.) మాస్‌లైన్, నిజామాబాద్ రూరల్, కామారెడ్డి సంయుక్త జిల్లా కార్యదర్శి. వి. ప్రభాకర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని కుమార్ నారాయణ భవన్ లో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీపీఐ(ఎం.ఎల్.) మాస్ లైన్ నిజామాబాద్ రూరల్ కామారెడ్డి సంయుక్త జిల్లాకమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ కుల ఉచ్చులో పేదలు, శ్రమజీవులు పడకూడదన్నారు. బీజేపీ కుల ఉన్మాదానికి వ్యతిరేకంగా పోరాడలన్నారు. సీపీఐ(ఎం.ఎల్.) మాస్ లైన్ నాయకులు దేవరాం, ముత్తేన్న, రమేష్, పీడీఎస్‌యూ, పీవోడబ్ల్యూ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభాకర్

అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లతో ఉపాధి అవకాశాలు

నిజామాబాద్ సిటీ : ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నెలకొల్పిన అడ్వాన్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో నైపుణ్యంతో కూడిన శిక్షణ పొందడంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అందుబాటులోకి తెచ్చిన 65 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను శనివారం హైదరాబాద్‌లోని మల్లెపల్లి ఏటీసీ సెంటర్ నుంచి మంత్రులు జి.వివేక్ వెంకటస్వామి, డి.శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితరులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్చువల్ విధానం ద్వారా లాంఛనంగా ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో భాగంగానే నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని శివాజీ నగర్ లో గల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐ.టీ.ఐ) ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు ఏ.టీ.సీ కేంద్రాలను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డితో కలిసి షబ్బీర్ అలీ ప్రారంభించారు. ఏ.టీ.సీ కేంద్రాలలో వివిధ కోర్సులలో శిక్షణ అందించేందుకు వీలుగా నెలకొల్పిన ఆధునిక యంత్రాలను పరిశీలించారు. ఈ మేరకు నిజామాబాద్ జిల్లాలోని బోధన్, కమ్మర్‌పల్లి, భీమ్‌గల్, నిజామాబాద్ లలో ఐదు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. ఒక్కో ఏ.టీ.సీ సెంటర్ కు రూ. 4.70 కోట్ల నిధులను ఖర్చు చేశారని వివరించారు. ఈ అవకాశాన్ని యువతీ, యువకులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్, ఏటీసీ కేంద్రాల ప్రిన్సిపాల్స్, ఇన్ స్ట్రక్టర్లు, శిక్షణ పొందుతున్న అభ్యర్థులు పాల్గొన్నారు.



బోధన్‌లోని మైనారిటీ ఐటీఐలో మిషనరీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

నైపుణ్యంతోనే ఉద్యోగ అవకాశాలు

బోధన్‌టౌన్(బోధన్): మారుతున్న కాలంలో నైపుణ్యంతోనే ఉద్యోగ అవకాశాలు ఉంటాయని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని మైనారిటీ ఐటీఐలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభించి అందులో ఏర్పాటు చేసిన మిషనరీని పరిశీలించి పనిచేసే తీరును ఇన్‌స్ట్రక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, ఉర్దూ అకడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్, పట్టణ అధ్యక్షులు పాషా మొయినొద్దీన్, మండల అధ్యక్షులు నాగేశ్వర్‌రావ్, డీసీసీ డెలిగెట్ గంగాశంకర్, నాయకులు శరత్ రెడ్డి, దాము, విష్ణువర్ధన్ రెడ్డి, ఆదినారాయణ, ఐటీఐ ఇన్‌స్ట్రక్టర్లు తదితరులున్నారు.

గుంతలు ఇలా.. వెళ్లేదెలా..



రాజానగర్ హనుమాన్ మందిరం వద్ద గుంతలమయంగా రోడ్డు



చాకలి ఐలమ్మ విగ్రహం సమీపంలో..

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహం నుంచి బజార్ కొత్తూర్ గ్రామం వరకు గల ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారింది. అడుగుకో గుంత, గజానికో గొయ్యిలా మారింది. గుంతల రోడ్డుపై ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది. గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. వాహనదారులు పలు మార్లు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

కసూర్బా గాంధీ బాలిక విద్యాలయం వరకు

బాల్కొండ: ముప్కాల్‌లోని కసూర్బా గాంధీ బాలికల విద్యాలయం భవనం వరకు గల రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మరింది. పాఠశాల కోసం నూతన భవనాన్ని మండల కేంద్ర శివారులో నిర్మించారు. పెద్ద వాగు రోడ్డు నుంచి పాఠశాల వరకు గల మట్టి రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారింది. దీంతో వర్షం కురిస్తే బురదమయంగా మారుతోంది. అధికారులు స్పందించి సీసీ రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ముప్కాల్ కేజీబీవీ పాఠశాల రోడ్డు

వైద్య శిబిరానికి స్పందన

రెంజల్/వేల్పూర్: స్వస్థ్ నారీ సశక్తి పరివార్ కార్యక్రమంలో భాగంగా శనివారం రెంజల్, వేల్పూర్ పీహెచ్‌సీల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈకార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

